# గీతోపనిషత్


(శ్రీమద్భగవద్గీత 12వ అధ్యాయము - భక్తి యోగము)


మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

# ధనిష్ఠ ప్రచురణలు














ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
Phone : 0891-2701531 www.dhanishta.org info@dhanishta.org

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 12వ అధ్యాయము - భక్తి యోగము)

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 07-11-2021 ప్రతులు : 1,000

(మాస్టర్ పార్వతీకుమార్‌గారి 77వ జన్మదినోత్సవము)

© ధనిష్ఠ ఫౌండేషన్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

వెల : రూ॥ **60-00**

ప్రతులకు :

**ధనిష్ఠ ఫౌండేషన్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

ఫోన్ : 0891-2701531, 2509154.

website : www.dhanistha.org.

info@dhanistha.org.

ముద్రణ :

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**

మధురానగర్, విశాఖపట్నం.

ఫోన్ : 0891-2796538, 9849996538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 34 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమ గురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 12వ అధ్యాయము - భక్తి యోగము)

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| | ఉపోద్ఘాతము | ....... | 9 |
| 1 | క్షమాగుణము | ....... | 11 |
| 2 | సతత సంతుష్టుడు | ....... | 20 |
| 3 | అహింస | ....... | 23 |
| 4 | ఉదాసీనత | ....... | 25 |
| 5 | స్థితప్రజ్ఞుడు | ....... | 29 |
| 6 | సమ దర్శనులు | ....... | 31 |
| 7 | స్థిరమతులు | ....... | 33 |
| 8 | ఏది ఉత్తమము ? | ....... | 38 |
| 9 | ఉత్తమ యోగులు | ....... | 41 |
| 10 | ఋషులు, మహర్షులు | ....... | 43 |
| 11 | తత్త్వ స్పర్శ | ....... | 45 |
| 12 | సర్వ సమర్పణము | ....... | 47 |
| 13 | భాగవత మార్గము | ....... | 50 |
| 14 | నిరంతరత్వము | ....... | 52 |
| 15 | కర్మ నిర్వహణము | ....... | 54 |
| 16 | భగవదర్పితము | ....... | 57 |
| 17. | కర్మఫలము | ....... | 59 |
| 18. | అత్యంత ప్రియులు | ....... | 63 |

# ఉపోద్ఘాతము

విశ్వరూపదర్శన ప్రాప్తి అనంతరము భక్తియోగము భగవద్గీత యందు తెలుపబడినది. సర్వము తానే, తనయందే సమస్తము సృష్టింపబడి, వృద్ధిచెంది యున్నది. దానియందు తానే వసించి యున్నాడు. తనయందే సృష్టి యంతయు వర్తించుచున్నది. తాను సృష్టియందు అణువణువున వసించి యున్నాడు. దానిని చూచుట, వినుట, ఆనందించుటను కుమారులు, సప్త ఋషులు, మనువులు, ప్రజాపతులు, కొందరు దేవతాగణము, మానవులలో కొందరు సిద్ధులు నిర్వర్తించుకొనుచు, ఆ తత్త్వము యొక్క దివ్యకళా వైభవమును అనుభవించు చున్నారు. ఋషులు దానిని 'తత్' అని పిలిచినారు. 'సత్' అని కూడ అనినారు. దాని వైభవమును 'చిత్' అనినారు (చైతన్యము). సత్యస్థితి, చైతన్య వైభవమును రుచి చూచుచు, నిత్యానందమయులై సృష్టికి తోడ్పాటు గావించుచున్నారు. ఇట్టి వారిది అనన్య భక్తి. వారిది పర్యుపాసన. వారు సతతము దైవముతో కూడియే యుందురు. దైవ సంకల్పమునే నిర్వర్తింతురు. వారికి అన్యచింతనలు లేవు. వీరి భక్తినే పరమప్రేమ అందురు. ఇట్టివా రెట్లుందురో ఈ అధ్యాయమున మొట్ట మొదట వివరింపబడినది. ఈ స్థితి యందున్న వారు ఏ లోకము నందున్నవారైనను ముక్తులే. వారికంతయు దైవమే.

పై స్థితి చేరుటకు మూడు సోపానములుగ ఈ అధ్యాయము

అమర్చబడినది. వరుసగ మూడు సోపానములును క్రిందుగ అమర్చ బడినవి. అనగ మొత్తము నాలుగు సోపానములు. పై తెలుపబడిన స్థితి పరమపదము. అటుపైన కర్మజులగు జీవులకు ఊర్ధ్వగతికి మార్గము తెలుపబడును. అటుపై ఆధ్యాత్మిక సాధనలు తెలుపబడెను. చివరగా కూర్పు చేసుకొనవలసిన దివ్య లక్షణములు తెలుపబడెను. అవరోహణ క్రమమున తెలుపబడిన ఈ అధ్యాయమును, బుద్ధి మంతులు ఆరోహణ క్రమమున పొందుట క్రమపద్ధతి.

మనసేంద్రియ శరీరములకు లోబడియున్న జిజ్ఞాసువులు, క్రమ పద్ధతిన దైవమును చేరుటయే యోగసాధన. క్రమ పద్ధతిన సాధన చేసినచో ఎప్పటికప్పుడు మార్గము గోచరించును. తనకు తోచినదెల్ల చేసినచో సమస్త మగమ్యగోచరమై యుండును. కనుక ఈ పుస్తకమున భక్తియోగమందలి ఇరువది శ్లోకములను, నాలుగు భాగములుగ విభజించి, ఆరోహణ క్రమమున తెలుపుటకు ప్రయత్నము జరుగుచున్నది. 1,2,3 తరగతులు క్రమముగ అభ్యసించి నచో నాలుగవది యగు స్థితి కలుగును. వానిని విస్మరించినచో కారడవియందు చీకటిలో చిక్కిన వానివలె సంశయము, సందేహము లతో, భయముతో జన్మ పరంపరలకు లోనగుదురు.

ఈ ముద్రణమును సమర్పించిన **శ్రీ బి.సత్యనారాయణరాజు కుటుంబమునకు** గీతాచార్యుని ఆశీస్సులు.

**- పార్వతీకుమార్**

1

## క్షమాగుణము

**అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।**
**నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥ 13**

తాత్పర్యము *:* అన్ని ప్రాణుల యెడల ద్వేషము లేనివాడు, మైత్రి కలవాడు, దయ కలవాడు, అహంకార మమకారములు లేనివాడు, సుఖ దుఃఖములందు సమభావము కలవాడు, ఓర్పు గలవాడు నాకిష్టుడు.

వివరణము *:* అనన్య భక్తి సూత్రములను భగవానుడు వివరించుచున్నాడు. ఈ భక్తి ఆర్తులకు, అర్థార్తులకు అందని విషయములు. సాధకులకు అవసరమగు విషయములు. దీనిని సాధనా సూత్రములుగ గైకొని దృఢ సంకల్పముతో నిశ్చయ బుద్ధితో, దీక్షతో, నిశ్శబ్దముగ నిర్వర్తించుకొనువారే సత్సాధకులు. వీరే జ్ఞానులుగను, సిద్ధులుగను పరిణతి చెందుదురు.

ఉపోద్ఘాతము క్షుణ్ణముగ చదువుకొనుట వలన ఈ శ్లోకము అర్థవంత మగును. ఈ సూత్రములు పాటించుటలో భగవంతుని

చేరుట అను ఆశయము ముఖ్యమై యున్నది. భక్తి వేరు, అనన్య భక్తి వేరు. భగవంతుని యందు భక్తి విశ్వాసములు ఏర్పడిన వారికే ఈ సూత్రములను అనుసరించుట పురోగతి నిచ్చును. ఆర్తులు, అర్థార్తులు చేయు భక్తి ప్రకటనములు, ప్రవర్తనములు వేరు. అనన్య భక్తి చిత్తమందలి వికాసమును బట్టి పరిణామ క్రమమున దైవమే అనుగ్రహింప గలడు. భక్తి అనన్యము కావలెనని ఎన్నియోమార్లు భగవంతుడు పలికినాడు. ఇచ్చట అద్భుతమగు ఒక సూత్రమాలను అందించినాడు. దీనిని బుద్ధిమంతుల కొరకై, జిజ్ఞాసువుల కొరకై వివరించుట జరుగుచున్నది. ఈ సూత్రము నిర్వర్తించుటకు యోగసాధకులకు ధైర్య సాహసము లుండవలెను. ప్రధానముగ మౌనముండవలెను. జిజ్ఞాసత్వము అధిక మగు చుండవలెను. తెలుసుకొనుచుండుట నిత్యమై యుండవలెను.

## 1. సర్వప్రాణులయందు ద్వేషము లేకుండుట :

ఇది అసామాన్యమైన విషయము. సృష్టిని దర్శించినపుడు అందనేక ప్రాణులు కనిపించుచుండును. అందు సచేతనములు, అచేతనములు యున్నవి. అచేతనములు సచేతనములగు చుండును. అందువలన కదలుచున్న జీవులను, జంతువులను, కదలక పెరుగుచున్న వృక్షములను, అంతర్గతముగ కదలిక కలిగి, బయటకు గోచరింపని ఖనిజములను చూచినపుడు, దేని యందును ద్వేషము కలుగరాదని భగవానుని సూచన.

మానవుడు ప్రధానముగ మనసునందు జీవించును గనుక సృష్టిని దర్శించినపుడు ఇష్టా ఇష్టములు, రాగద్వేషములు పొంది, ఈర్ష్య అసూయలు, కామక్రోధములు, లోభ మోహములు, మద మాత్సర్యములు అను కలుషత్వమునబడును. మంచివారిని, చెడ్డ వారిని విభజన చేసుకొనును. మంచి చెడులను గ్రహించుచు, చెడును ద్వేషించును. మంచిని గ్రహించువాడు చెడును ద్వేషించుట వలన తనను తాను పరిమితుడు గావించుకొను చుండును. తన దృష్టిని బట్టి తన మంచి చెడులు తనకు తోచును. అవి పరిణామ మున మారుచుండును. తాను ద్వేషించు విషయములందు సాధకునకు తటస్థబుద్ధి యుండవలెను. ద్వేషము తనకు అపాయ కరము. దైవము ప్రేమించమని చెప్పుటలేదు. ద్వేషించవద్దని చెప్పుచున్నాడు.

"Enemies! Beware of yourself" అని పరమగురువు సి.వి.వి. హెచ్చరిక చేయుటలోని ఆంతర్యమిదే. ఇచ్చట ఎవరిని, దేనిని ద్వేషింపకని మాత్రమే సూచన. ఎవరి ద్వేషము వారియందు విషమై వారిని నశింపజేయును. ఇది సాధకులు తెలుసుకొన వలసిన విషయము.

**2. మైత్రి :**

మిత్రత్వమొక దివ్య సంపద. ఈ సంపద లేనివాడు ఎన్ని సంపదలున్నను లేనివాడే. తోటి జీవులయందు సమభావము

కలిగియుండుట వలన మిత్రత్వ మేర్పడును. స్థితిగతులనుబట్టి, కులగోత్రములను బట్టి, మతములనుబట్టి, జాతులనుబట్టి వైవిధ్య మగు భావములు కలుగుట సహజము. వాని మూలమున నున్న జీవుని చూడగలిగినపుడు మాత్రమే సమభావ మేర్పడును. జీవ చైతన్యమును దర్శించుచు, వాని పైపొరలుగ పై తెలిపిన వైవిధ్య భావములు గుర్తించుట సమదర్శన మిచ్చును. సమభావమును గూడ ఇచ్చును. ఇట్లు దర్శించు వానికి భిన్నత్వమున ఏకత్వము, ఏకత్వమున భిన్నత్వము గోచరించి, దివ్య మహిమ అనుభవము నకు వచ్చును.

మిత్రత్వమొక వైభవము. అదియొక దివ్యగుణము. దానిని కోరి అభ్యసింపవలెను. అది సహజమై, శాశ్వతమై యుండవలెను. మైత్రి అను పదమునకు పరిపూర్ణమగు ఉదాహరణము శ్రీరామ చంద్రుడే! అత డన్నిజాతులతోను మైత్రిని సలిపినాడు. నరులు, వానరులు, ఆటవిక జనులు, దాసీజనము, ఋషులు, అసురులు, మృగములు, పక్షులు అన్నిటియందు మిత్రత్వము చూపినాడు. మిత్రత్వమునకు రాముడే సాటి. దేవతలు, గురువులు కూడ రాముని మిత్రత్వమునకై ప్రాకులాడినారు.

మిత్రగుణము గలవానికి దేశము, కాలము అనుకూ లించును. ప్రతికూల సంఘటనలు కూడ అనుకూలముగ మారును. సామాన్య మానవులు ఈ దివ్యగుణము తెలియలేక,

ఈ గుణమును ఉపాసింపక, మిత్రులను కోల్పోవుచు, శత్రువులను తయారు చేసుకొనుచు, బలహీనులగుచు, ఒంటరితనమును అనుభవించుచు యుందురు. ఒకప్పటి మిత్రులే క్రమముగ శత్రువు లగుదురు. అట్టి సమయమున గూడ అంతరంగమున మిత్ర భావముండువాడు ఈ దివ్య గుణసంపదను అనుభవింప గలడు. జగద్గురువు మైత్రేయుడు ఇట్టి మిత్రమూర్తి. ఋషులలో విశ్వామిత్ర మహర్షి అట్టివాడు.

లౌక్యము ననుసరించి మిత్రత్వము చేయుట అల్పబుద్ధి. అది పారలౌకికమై, నిష్కారణమైన మిత్రత్వము ఆత్మానుభూతికి దారితీయును. ఆనందము నిచ్చును. కారణము లేని మిత్రత్వమే మిత్రత్వము. అచ్చట ఆనందము సహజమగు సిద్ధి.

**3. కరుణ :**

అనన్యభక్తి సాధన చేయువానికి జీవుల యెడల సహజముగ మిత్రత్వ మేర్పడగ, వారి పరిస్థితులను బట్టి వారియందు కరుణ సహజముగ కలుగును. ఆపదల యందున్నవానిని ఆదుకొన వలెనని అనిపించును. ఇట్లనిపించుట కారుణ్యము. అది హృదయ లక్షణము. కరుణ లేనివాడు పశుప్రాయుడే. కేవలము మనసున జీవించువారు దీని విలువ తెలియలేరు. లౌక్యమున జీవించు వారు చూపించు కరుణ వ్యాపారసరళిలో ఉండును. వీరు మానసిక కక్ష్య నుండియే కరుణా ప్రదర్శన చేయుచు నుందురు. నిజమగు

కరుణకు అవధులు లేవు. అవి మహాత్ముల జీవితమున పొడచూపు చుండును. వాని నుండి ఇతరులు స్ఫూర్తి చెందుచు నుందురు. జీవకారుణ్యము దైవము మెచ్చు సంపద.

సహవేదన, సహభావము, ఎదుటివాని ఇబ్బందులను గుర్తించుట, వీలున్నంత సహకరించుట, గుప్తముగ ఆదుకొనుట- ఇత్యాది వన్నియు కరుణ లక్షణములు. ఈ గుణములు పెంపొందించు కొనుమని దైవము హెచ్చరించు చున్నాడు.

## 4. నిర్మమ :

మమకారము లేకుండుట. ఈ గుణము కైలాస పర్వతము వంటిది. మమకారము లేనివారెవరు? సామాన్య భక్తులందరును నేను, నాది, నావి అను విషయములలో బంధింపబడి యున్నారు. దైవముకూడ తమ కొరకే అను భావములో నిండి యున్నారు. వీరందరు ఆర్తులు, అర్థార్తులుగనే స్థిరపడిపోయినారు. ఆరాధనెంత చేసినను, క్రతువులు వ్రతములు చేసినను, పుణ్య క్షేత్రదర్శనము చేసినను, తీర్థయాత్రలు చేసినను అంతయు తమకొరకే. తాను, తన కుటుంబము సుఖపడవలెనని కోరికయే. తమ ఆస్తులు, పాస్తులు రక్షింపబడవలెనని ఆరాటమే. వీరు శాశ్వతముగ తాపత్రయములో మునిగి యుందురు. వీరికి దైవము ఒక అద్భుత దీపము వంటిది. కోరికలను తీర్చు చింతామణి వంటిది. వీరెట్టి దైవారధన చేసినను తమకొరకే గాని, దైవముకొరకు గాదు. ఈ

12వ అధ్యాయమున ఇట్టివారి గూర్చి ప్రసంగించుటలేదు. జిజ్ఞాసువులను గూర్చి ప్రసంగించు చున్నాడు. అనన్య భక్తి యోగమునకు ఈ గుణము సంతరించుకొనుట అత్యంత ప్రధానము. తాను, తనది, తనవారు అను విషయమునందు రమించువాడు దేవునియందు ఎట్లు రమించగలడు, ప్రేమించ గలడు? దేవుడవసరము గనుక, దేవుని కాళ్లు పట్టుట వ్యాపారబుద్ధి. దివ్యమార్గమున ప్రయాణించువారు తరతమ భేదములను క్రమముగ నశింపజేసుకొని నాదమార్గమున పురోగమింపవలెను.

**5. నిరహంకారము :**

అహంకారము లేనివాడు. ముందు తెలిపిన మమకారము కైలాస పర్వతముకాగ, నిరహంకారము ఎవరెస్టు శిఖరము వంటిది.

క్షరపురుషున కితడే అధిపతి. మాటి మాటికిని నేను, నేను, నేను అనుచు నుండును. నేను చూశాను, నేను చేశాను, నేను విన్నాను, నేను వచ్చాను అనుచు నుండును. అంతా తానే, అంతా తన ప్రతిభే అని భావించుచు, జీవించుచు భంగపడుచుందురు. రావణుడు, హిరణ్యకశిపుడు ఇత్యాది వారందరు అహంకారము నకు పరాకాష్ఠ. సామాన్య మానవులలో ఇది చాల సహజము. తామే అంతా అని భావిస్తారు. తమయందలి ప్రాణ ప్రవృత్తులు, తమయందలి ఎరుక, తమ ఉనికికి కారణమని తెలియదు. ఈ అహంకారము తొలగుటకు జ్ఞాన మవసరము. అట్టి జ్ఞానమునకు

జిజ్ఞాస అవసరము. అట్టి జిజ్ఞాసువునకు దీక్ష అవసరము. దీక్ష అనుసరించు చున్నపుడు అహంకారము కరుగును. అహంకార మందలి మలినములు నశించును. నిర్మము, నిర్మలము అగు అహంకారమునకు తానొక ప్రతిబింబమని తెలియును. తన మూలముతో తా ననుసంధానము చెందుట జరుగును. అట్టి వాని కహంకారము క్రమముగ పారదర్శకమై, మూలము ప్రతిబింబించును.

మమకార, అహంకారములు దాటుటకే సమస్త సాధనలు నిర్దేశింపబడినవి. ఈ రెండును అనన్య భక్తుని లక్షణములలో భగవంతుడు పేర్కొనినాడు.

పై రెండు లక్షణములు నిత్యము సాధింపవలసినవి.

**6. సమదుఃఖసుఖః :**

దుఃఖమును, సుఖమును సమభావముతో స్వీకరించుట. ఇది అనన్య భక్తులకే సాధ్యము. సుఖమునందు పొంగకుండుట యుండవచ్చును గాని, దుఃఖమునందు క్రుంగకుండుట అంత సాధ్యమైన పనికాదు. సుఖము కలిగినపుడు భగవదనుగ్రహమని భక్తులు కృతజ్ఞతతో నుందురు. దుఃఖము కలిగినపుడు అదియు దైవ సంకల్పమే అని భావించుటకు అచంచలమైన దైవభక్తి యుండవలెను. జీవితమున కష్టసుఖములు తరంగములుగ వచ్చునని తెలిసినను, కష్టకాలమున దైవముతో కూడియుండుట

అందరికిని సులభము కాదు. ఇట్టి సమయముననే భక్తుల కథలు, భగవంతుని కథలు పఠించుకొనుచు భగవద్భావమున ముడిపడి యుండవలెను. కష్టములు తీరువరకు అదే సమభావముగ నుండ వలెను. కాని ఈ సమయముననే భక్తునియందు అనేకానేక ప్రశ్నలు పుట్టును. తన కెందుకింత కష్టము వచ్చినదని ప్రశ్నించుకొనినను, సమాధానము దొరకదు. కొంత మనసు వికలమైనను త్వరితగతిని అంతయు దైవ విలాసమని భావించి, దైవముతో కూడియుండుట అనన్యభక్తి లక్షణము. దీని నభ్యసించు ప్రయత్నము అత్యవసర మని దైవము తెలుపుచున్నాడు.

**7. క్షమ :**

క్షమము కలవారే ఈ స్థితిని పొందగలరు. క్షమ అనగా ఓర్పు. భరించు శక్తి. ఇది శనైశ్చరుని గుణము. భూమి గుణము. శ్రీరాముని యందు, ధర్మరాజు యందు ఈ గుణము మిక్కిలిగ దర్శింపవచ్చును. క్షమ గలవారిదే అంతిమ విజయము. క్షమ లేనివాడు ఆత్మ దర్శనమునకు, దైవ దర్శనమునకు అర్హుడు కాలేడు. భూమిని మోయుచున్న వాసుకి, అట్లాస్ (గ్రీకు మహా పురుషుడు)లను కూడ ఈ సందర్భమున పేర్కొనవచ్చును. భారతమున కుంతీదేవి భక్తి యందు కూడ ఇట్టి క్షమ దర్శింప నగును. క్షమించు బుద్ధి కలవాడు కష్టనష్టములను కూడ భరించ గలడు. సుఖ దుఃఖములను సమానముగ స్వీకరించ గలడు. ఈ శ్లోకమున కిదియే చివరకు తెలుపబడిన భక్తి లక్షణము.

## ②

## సతత సంతుష్టుడు

**సంతుష్ట స్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।**
**మయ్యర్పిత మనోబుద్ధి ర్యో మద్భక్తస్స మే ప్రియః ॥ 14**

తాత్పర్యము : ఎల్లప్పుడు సంతుష్టుడై యుండువాడు, దైవమునందు చిత్తము చేర్చి యుంచువాడు, మనస్సును స్వాధీనమున యుంచువాడు, దృఢమగు సంకల్పము గలవాడు, నా యందు అర్పింపబడిన మనసు గలవాడు నాకు ప్రియుడు.

వివరణము :

**1. సతత సంతుష్టుడు** :

ఎల్లప్పుడు సంతోషముగ నుండువాడు. కోరికలు లేనివాడే సంతోషముగ నుండగలడు. ఎచ్చట కోరికలుండునో అచ్చట అశాంతి యుండును. అనన్యభక్తి సాధనయందు సమస్తము నందును దైవమును చూచుట, కర్తవ్యము నిర్వర్తించుట, అట్టి నిర్వహణమున ఆనందము పొందుట యుండును గాని, ఇతర ముండదు. చేసిన పనియందే ప్రత్యక్షముగ దైవమును దర్శించుచు

వినోదించును. ఇట్టి వానికి ప్రత్యేకముగ వినోద కార్యక్రమముల అవసరముండదు. సమస్తము వినోదము నిచ్చుచునే యుండును. వినోదమునకై కార్యక్రమము లేర్పరచుకొనుట సామాన్యము. జీవితమునే వినోదమయము చేసుకొనుట అసామాన్యము. ఎల్లప్పుడును సంతోషముగ నుండుటకే జీవి ప్రయత్నించుచు నుండును. అట్టి ప్రయత్నము సిద్ధించుటకు వలసినది అనన్య భక్తియే. తన పరిసరము లందున్నవి దైవమే అని భావించు వానికి ఇట్టి స్థితి కలుగును. బలిచక్రవర్తికి వామనమూర్తి చేసిన ఉపదేశ మిదియే.

**2. యోగి :**

తనయందే యున్న ఈశ్వరునితో కూడియున్న పురుషుడు యోగి అనబడును. ఇట్టి యోగస్థితి జీవుని కడతేర్చును. తన యందు ఈశ్వరుడు అధిష్ఠించి యున్నాడని తెలిసి అతడే తన మూలమని తెలిసి, అతని సంకల్పము మేరకే జీవించుచు, అతడందించిన జ్ఞాన మాధారముగ కార్యములు నిర్వర్తించుచు, అతని మహిమను దర్శించుచు, ఆనందించువాడు యోగి. ఇట్టి వానికి మనస్సు తన అధీనమున యుండును. కనుక 'యతాత్మ' అని పిలువబడును. అతని నిశ్చయములు కూడ దృఢమై యుండును. అనగా చంచల స్వభావముండదు. అతని మనస్సు, బుద్ధి అతనితో పాటుగ ఈశ్వర కైంకర్యము చెంది యుండును. అట్టివాడు ఈశ్వర కింకరుడు. అనగా

సేవకుడు. అట్టి వానినే ఈశ్వరుడు తన జగత్ కళ్యాణ కార్యమున అవసరమును బట్టి నియమించుకొనుచు నుండును.

భగవద్గీత యందే మరియొక చోట "యోగీభవ అర్జున" అని పలికినాడు. యోగులు భగవత్ ప్రియులు. భగవంతునికి యోగులు ప్రియులు. యోగ పరంపరనుండియే భగవత్ తత్త్వము మానవాళి నుద్ధరించుచున్నది. అట్టి పరంపర నధిష్ఠించి జగద్గురువు మైత్రేయ మహర్షి భూగోళమంతయు ప్రచోదనము గావించు చున్నారు.

## 3

## అహింస

**యస్మా న్నోద్విజతే లోకో లోకా న్నోద్విజతే చ యః ।**
**హర్షామర్ష భయోద్వేగై ర్ముక్తో యస్స చ మే ప్రియః ॥ 15**

*తాత్పర్యము :* ఎవని వలన ప్రపంచము భయపడదో, ఎవడు ప్రపంచము వలన భయపడడో అట్టివాడు నాకు ప్రియుడు. ఎవడు ఉద్వేగము చెందడో, క్రోధము పొందడో, భయము వ్యాకులత కలిగియుండడో అట్టివాడు నాకు ప్రియుడు.

*వివరణము :* లోకమందు భయము అజ్ఞానరూపమై తాండవించుచు నుండును. ఒకరిని చూచి ఒకరు భయపడుచుందురు. దీనికి లోకమందలి హింసావృత్తియే మూలకారణము. ఎవనియందు హింసాబుద్ధి యుండునో వానియందు భయపడుట, భయపెట్టుట యుండును. అహింస చక్కగ పాలించు వానివద్ద భయకారణముండదు. అహింస పరమధర్మములలో ఒకటి. అహింస పాటించు వానికి భయముండదు. అతని వలన ఎవ్వరికిని భయము కలుగదు. ప్రతివారికిని భయకారణము తనయందే యుండును. భగవద్భక్తునకు సమస్తము దైవమువలె తోచుట

వలన అతనికి భయముండదు. అతని వలన ఇతరులకు భయ ముండదు. ఇట్టివారు నిజమగు జనప్రియులు, లోకప్రియులు కూడ. వారు నిరంతరము ప్రసన్నతను ప్రసరింప జేయుచు నుందురు. వారి ఉనికి ఎట్టి అలజడి లేక యుండును. ఎవ్వరికిని ఎట్టి భంగము కలిగింపరు. ఇట్టివారు భగవంతునికి ప్రియులు.

అట్లే మనోవ్యాకులత, కోపము, ఉద్వేగము లేనివారు తనకు ప్రియులని భగవానుడు పలుకుచున్నాడు. జీవితమున సుఖ దుఃఖములు కలిగినపుడు సుఖమునకు పొంగుట, దుఃఖము నకు క్రుంగుట సామాన్యము. కాని అనన్యభక్తి సాధకుడు ఆ సంఘటనల యందలి వాసుదేవ స్వరూపమును దర్శించుచు, అమితముగ పొంగక క్రుంగక యుండును. కోపము, భయము, వ్యాకులత వంటి సన్నివేశములందు కూడ వాసుదేవుని గమ నించుచు మనోభావముల నుండి ముక్తులై వర్తించు చుండును. ఇట్టి మనోమయ వికారము నుండి ముక్తి పొందిన వాడైనచో తన కిష్టమని దైవము పలుకుచున్నాడు.

## 4

## ఉదాసీనత

**అనపేక్ష శ్శుచి ర్దక్ష ఉదాసీనో గతవ్యథః ।**
**సర్వారంభ పరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః ॥ 16**

*తాత్పర్యము :* ఏమియు అపేక్షించనివాడు, లోపల బయట శుచి గలవాడు, దక్షత కలవాడు, అన్య విషయములందు ఆసక్తి లేనివాడు, గతించిన దానికి చింతించనివాడు, దుఃఖములకు లొంగనివాడు, తానుగ ఏదియు ప్రారంభింపనివాడు నాకిష్టుడు.

*వివరణము :* అనన్య భక్తునకు సాలోక్య, సాయుజ్య, సాన్నిధ్య, సారూప్యమే జీవితముగ సాగును. అతని కితర అపేక్ష లుండవు. అంతర్ముఖముగను, బహిర్ముఖముగను కూడ దైవమునే చూచుచు, వినుచు నుండును. అవసరమును బట్టి సేవించుచు నుండును. మరియొక అపేక్ష యుండదు. ఇతర కోరికలకు తావుండదు. అవసరము లప్రయత్నముగ తీరుచుండును.

తన లోపల, తన వెలుపల యున్న దైవమును దర్శించు ప్రయత్నములో లోపల బయట కూడ శుచి కలుగును. కాంతి పెరుగుచు నుండును. మేధస్సు కూడ పెరుగును. తత్కారణముగ

సమర్థత పెరుగును. ఇనుమడించిన దక్షతతో కార్యములు నిర్వర్తించుచు నుండును. అది శుచిత్వము వలన, సమర్థత అయి ఉండుట వలన మహిమ, వైభవములు కూడ యుండును. కేవలము దక్షత యున్నదని కార్యములు నిర్వర్తించువారు శుచి లోపముచే దివ్యానుభవము కోల్పోవు చుందురు. శుచి వలన మహిమ అవతరించును. శుచి లేనిచోట అలక్ష్మి చేరి సత్ఫలితముల నీయక, దుష్పరిణామములకు కూడ తెరతీయును. అహంకారుల ప్రయత్నములు భగ్నమగుటకు కారణము అశుచియే. భగవత్ భక్తుడు తనయందు శుచిని, దక్షతను భక్తి యోగమున పెంపొం దించుకొనుచు సాగవలెను. శుచి, దక్షత రెండు రెక్కలవలె భక్తుని ప్రజ్ఞ ఊర్ధ్వగతిని చెందవలెను.

ఉదాసీనత అనన్యభక్తుని లక్షణము. సమస్తమునందు దైవమును దర్శించు వానికి అన్య విషయములందు ఆసక్తి యుండదు. అన్య విషయములు విషమువలె తోచును. ఇతరు లను గూర్చి చర్చించుట, విమర్శించుట, అభిప్రాయము లేర్పరచు కొనుట వంటి విషయములందు నిజమగు భక్తులు పాల్గొనరు. ఉదాసీనులై దైవమునే దర్శించుచు నుందురు. నిర్వీర్యమగు భాషణములు సాగుచున్నపుడు మౌనముగ నుందురు. తమకు సంబంధములేని విషయములలో తలదూర్చరు. ఉదాసీనత భగవద్భక్తుల లక్షణములలో ఒకటిగ పేర్కొనబడినది. కర్తవ్యము లేనిచోట కల్పించుకొని, కర్మమునందు చొరబడువారు పర్యవ

సానములను కొనితెచ్చుకొందురు. ఉదాసీనులకు అట్టి ప్రమాదము లేదు.

అనన్యభక్తి సాధకునకు దైవము ప్రస్తుతమై యుండును. కనుక జరిగిపోయిన విషయములందు, గతించిన విషయము లందు పట్టుబడి యుండడు. జరిగిన విషయములు తిరిగిరావు. వానియందు మనసు తగుల్కొనినపుడు వ్యథ కలుగుచు నుండును. భక్తుడు ప్రస్తుతమున యున్న సన్నివేశము దైవముగ గుర్తించి, దానితో అనుసంధానము చెందుచు రమించునుగాని, పాత విషయములను త్రవ్వుకొని బాధపడడు. అట్టి వానిని గతవ్యథుడు అని పిలుతురు. ప్రస్తుతమున అతడు సంసిద్ధుడుగ నుండుటచే భగవంతునికి ప్రియుడై యుండును. జరిగినవి, జరుగబోవునవి చింతించు వానికి మిగులునది అశాంతియే. ప్రస్తుతమున కర్తవ్యము నందుండు వారికి అశాంతి బాధ యుండదు. వారు కర్తవ్యోన్ముఖులు గనుక వ్యథ యుండదు. అట్టివారు నా కిష్టులని దైవము పలుకు చున్నాడు.

స్వంత సంకల్పములు లేక, కేవలము భగవత్ సంకల్పము మేరకే జీవించువాడు నిజమగు భక్తుడు. జీవుడు గుణాత్మకుడు గనుక, గుణముల ప్రభావమువలన అనేకానేక సంకల్ప వికల్ప ములు కలుగుచు నుండును. సత్వగుణము నందు ఉన్నను కూడ సుఖేచ్ఛ ఉండును. ఇచ్ఛ ఉన్నచోట రజస్తమస్సుల ప్రభావ ముండును. భగవద్భక్తుడు భగవంతుని యందే, తనను తాను

చేర్చి యుండునేగాని, ఇచ్ఛ, జ్ఞాన క్రియల యందుండడు. భగవత్సంకల్పము మేరకే త్రిగుణముల యందు ప్రవేశించును. తనకు తానుగ ఏదియును సంకల్పింపడు. వారు ఆరంభ పరిత్యాగులు, సంకల్ప సన్యాసులు కూడ. వారు తమ ఉనికిని భగవంతుని ఉనికిలో చేర్చి వసింతురు. కార్యాచరణములోనికి దిగినను ఉనికిని మరవరు. కార్యాచరణముగూడ భగవత్సం కల్పము మేరకే సాగుచుండును. ఇట్టివారు తమ కొరకు గాక, ఇతరుల కొరకు, అనగా ఇతరుల రూపమున నున్న ఈశ్వరుని కొరకు పనిచేయుచు నుందురు. వీరి చేతలు కూడ కారణాతీతమై యుండును.

సృష్టియందు నారదుడు, దుర్వాసుడు, అగస్త్యుడు, వశిష్ఠుల వంటి వారి జీవిత ఘట్టములలో ఆరంభ పరిత్యాగమును దర్శింప వచ్చును. అట్లే రామకృష్ణాది అవతారములలో ఆరంభ పరి త్యాగము దర్శింపవచ్చును. ఎంత జ్ఞాను లైనప్పటికిని ఈ సద్గుణము లేనిచో త్రిగుణములచే ఆకర్షింపబడి ద్వంద్వమున పడుదురు. ఉండుటయే సుఖము గాని కోరుట సుఖము కాదని తెలిసి, కాలమును దేశమునుబట్టి కర్తవ్యమును మాత్రము నిర్వర్తించు వారు సృష్టియందు వర్తించుచు తరింతురు.

## ⑤

## స్థితప్రజ్ఞుడు

**యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి ।**
**శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్ య స్స మే ప్రియః ॥ 17**

*తాత్పర్యము :* జీవన సన్నివేశముల యందు పొంగనివాడు, ద్వేషింపనివాడు, శోకము చెందనివాడు, కాంక్షించనివాడు, శుభాశుభములను వదలినవాడు అగు భక్తుడు నాకు ప్రియుడు.

*వివరణము :* భగవద్భక్తుడు సమస్తము నందును భగవంతుని దర్శించి సేవించుటయే యుండును. తదానందమును పొందుచు నుండును. అతనికి ప్రత్యేకమగు వినోద కార్యక్రమము లుండవు. కాలమును దేశమును బట్టి కర్తవ్యమున ఉండుట యుండును. సన్నివేశమే దైవస్వరూపము. అందలి దైవమును దర్శించుటవలన కర్తవ్యపాలనముననే ఆనందము సిద్ధించును. ప్రత్యేకముగ ఆనందించుటకు కార్యక్రమముల అవసరము లేదు. అతనికి గెలుపు ఓటములు కూడ లేవు. చేయుట, ఆనందించుట మాత్రమే యుండును. ద్వేషింపబడు వస్తువు కూడ యుండదు. అలల ప్రవాహమున సమస్తము వచ్చి పోవుట చూచుచు

నుండును. ఇది కావలెనని ఉండదు. ఇది కాలేదని దుఃఖించదు. రాత్రింబవళ్ళు, పూర్ణిమ అమావాస్యలు, పెరుగుట తరుగుటలు, మార్పులు చేర్పులు అన్నియు కూడ తెరపై బొమ్మలాటవలె దర్శించుచు, భగవత్ మహిమను గుర్తించుచు, వినోదించుచు యుండుట స్థితప్రజ్ఞుడగు భక్తుని లక్షణము. ఇట్టి భక్తుడు తన కిష్టుడని దైవము పలుకుచున్నాడు.

6

## సమ దర్శనులు

**సమ శ్శత్రౌచ మిత్రే చ తథా మానావమానయోః ।**
**శీతోష్ణ సుఖదుఃఖేషు సమ స్సంగవివర్జితః ॥ 18**

*తాత్పర్యము :* శత్రువు నందును, మిత్రుని యందును, మాన అవమానముల యందును, చలి వేడిమి నందును, సుఖ దుఃఖముల యందును, సంగము వదలి సమభావముతో నుండు వాడు నా కిష్టుడు.

*వివరణము :* సమభావము, సమదర్శనము ఎల్లవేళల తటస్థబుద్ధి గలవారికే వీలుపడును. తటస్థబుద్ధి యనగా ద్వంద్వాతీతమైన స్థితి. గుణాతీతమైన స్థితి. ఈ స్థితియందున్నపుడు జీవునికి అవగాహన బాగుగ నుండును. సృష్టి యందలి ద్వంద్వములు గోచరించుచు నుండును. ద్వంద్వముల ప్రభావము తమపై పడకుండుటకు భక్తుడెల్లప్పుడును దైవముతో కూడి యుండును. దైవముతో కూడియున్న భక్తుని ద్వంద్వములు బాధింపవు. చలి వేడిమి అనునవి భౌతికములు. సుఖదుఃఖము లనునవి మనసు నందలి ఉద్వేగములు. అంతకన్న లోతైనవి మానావమానములు.

మనసునందున్నంత కాలము ఇవి జీవ ప్రజ్ఞను బాధపెట్టును. శత్రువులు, మిత్రులు కూడ మనోకక్ష్య యందే యుందురు. అహంకార మమకారములచే ముడిపడిన ప్రజ్ఞ మనస్సునందెల్ల కాలము ద్వంద్వములను అనుభవించుచునే యుండును. కాని భగవద్భక్తి, అనురక్తి యున్నవాడు సమస్తము నందును దైవమును చూచుట అను ప్రయత్నమున యుండును. అట్టి ప్రయత్నమున నున్న వానిని ద్వంద్వములు తీవ్రముగ బాధించవు. అతనియందు ద్వంద్వములు వికటించవు. సృష్టియందు ద్వంద్వముల ఆవశ్యకతను ఎరిగి, కాలమెరిగి, దేశమెరిగి కర్తవ్యమును నిర్వ ర్తించుట మాత్రమే యుండును. ఇట్టి భక్తుడు దైవీ సంపర్కముననే స్థితిగొని కార్యములు నిర్వర్తించుచు నుండును. అవతార పురుషు డగు శ్రీరాముని జీవితమునందు, పాండవాగ్రజు డగు ధర్మరాజు జీవితమునందు చాల సన్నివేశములలో వారు సమదర్శనులై ద్వంద్వమున కతీతముగ వర్తించి వెలుగొందిరి.

భగవదారాధనము భగవత్ప్రీతి కొరకే నిర్వర్తించుకొనుచు, సాలోప్య, సామీప్య, సాయుజ్య, సారూప్య స్థితులలో దైవముతో కూడియున్న వానిని ద్వంద్వములంత బాధింపవు. వారి దృష్టి కూడ ద్వంద్వముల వైపు పోదు.

భగవంతుడు అనన్య భక్తుల లక్షణములు పేర్కొనుటలో క్రమముగ అనన్య చింతనము, అనన్య దర్శనము మాత్రమే ఉపాయమని తేల్చి చెప్పుచున్నాడు.

7

## స్థిరమతులు

**తుల్యనిందాస్తుతి ర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్ ।**
**అనికేతః స్థిరమతి ర్భక్తిమా న్మే ప్రియో నరః ॥ 19**

*తాత్పర్యము :* నిందాస్తుతుల యందు సమతుల్యముగా నుండువాడు, మౌనము వహించువాడు, లభించిన దానికి సంతుష్టి చెందినవాడు, ఇల్లు ఆస్తిపాస్తుల యందు వ్యామోహము లేనివాడు, స్థిరబుద్ధి గలవాడు నాకు ప్రియమైన భక్తుడు.

*వివరణము :* ఎట్టి నరునికైనను నిందాస్తుతులు తప్పవు. పొగడ్తలకు నీడవలె నిందలు, విమర్శలు ఉండును. దీపము క్రింద నీడవలె, పగలుకు రాత్రివలె నిందాస్తుతులు సాగును. లోకము నందలి ఈ సత్యము గ్రహించవలెనేగాని, నిందాస్తుతులకు లొంగరాదు. అట్టివాడు తనయందు తానుండి, తన కర్తవ్యమును నిర్వర్తించును. లేనిచో మనసు వికలమై, చేయవలసిన పనులు కూడ మానును. దైవము తనకు సంకల్పించిన పని యందు తానున్నానని గ్రహించినవాడు పనియందే నిమగ్నుడై

యుండును గాని, ఇతర విషయములకు లొంగడు. అట్టివాడు నిజమగు భక్తుడు.

తనకు లభించిన దానికి సంతుష్టి చెందుట దివ్య లక్షణము. లభించని దానికేడ్చుట తమోగుణము. లభింపవలెనని తీవ్రమగు ప్రయత్నము చేయుట రజోగుణము. సంతుష్టుడు ఎప్పుడును పూజ్యుడే. కారణము అతడికేదియు కావలెనను బాధలేదు. దొరికిన దానికి సంతుష్టిగ నుండును. తన పనియందు తానుండును. ఇతరులతో పోల్చుకొని బాధపడడు. అసూయ పడడు. తన పని యందు తానుండును గనుక, తాను ఆనందమయ లోకమున నుండును. సంతుష్టుని కున్నంత స్వాతంత్ర్యము ఇతరుల కుండదు. తెలియక జీవులారాట పడుదురు గాని, జీవితమున తమ పని యందు తామున్న వారిని జీవితమే నడిపించును. జీవన నదీ ప్రవాహమున తేలియుండుట జ్ఞానముగాని, మునిగి ఈతలు కొట్టుట అజ్ఞానము. సాగుచున్న జీవితమును సాగనీయక అడ్డు పడు తెలివి వలన సంతోషము చెడును. తీరి దుఃఖపడు వారిని దైవము కూడ ఊరడించడు. వేచి యుండును. నిత్య సంతోషి వద్దకు దైవమే నడచివచ్చును. సంతుష్టుడు ఎక్కడనున్నను అతని అంతరంగ సంతోషమునకు అంతరాయ ముండదు. ఆ సంతోష మునే అందరికి పంచుచు నుండును. దైవము గూడ దరి చేరి, పరిసరములందు సంతుష్టుని పెంచును. భక్తులకు సాన్నిధ్య

మిచ్చి, వారి ద్వారా శుద్ధి, వృద్ధి, సిద్ధి దైవమిచ్చుచు నుండును. సంతుష్టుడగు భక్తుడు అరుదు. అట్టి భక్తులు నాకు ప్రియులని భగవంతుడు చెప్పుచున్నాడు.

అనికేతుడు అనగా గృహాదులు లేనివాడు. నికేతన మనగా ఆచ్ఛాదము, అనగా ఇల్లు. ప్రతి వారికిని ఇల్లు, ఆస్తిపాస్తులు ఇత్యాదివి ఆధారములై యుండును. నిజమగు భక్తులకు వీని యందు వ్యామోహముండదు. వారు దైవమే ఆధారముగా యుందురు. ఇతర ఆధారములను విశ్వసింపరు. అవియున్నను లేకున్నను ఒక్కటియే. దైవముతో కూడియున్న వానికి ఇతర ఆధారముల మీద మోజు తగ్గుట సత్యము. ఇతర ఆధారములకై మోజు పడువాడు దైవాధారమునుండి దూరమగును. దైవమునకు కూడ అందుబాటులో ఉండడు. అన్య మెరుగని భక్తి శ్రేష్ఠమగు భక్తులయందు గోచరించును గాని ఇతరుల యందు గోచరించదు. చిన్నసంఘటనలకే తడబడువారు, తల్లడిల్లువారు ఈ విషయము గుర్తించి దైవాధారమును పెంచుకొనవలెను. అంబరీషుడు, ప్రహ్లాదుడు, నారదులవంటి వారిని ఉదాహరణలుగ గుర్తుతెచ్చు కొనుచు నుండవలెను.

స్థిరమతులు నాకిష్టము అని భగవానుడు పలుకుచున్నాడు. స్థిరమతులనగా మనసునందు స్థిరమైన ప్రజ్ఞ గలవారు. ఇది సామాన్య విషయము కాదు. లోకములలో మనోలోకము అతి

వేగవంతమైన లోకము. అత్యంత వేగవంతమైన లోకములో స్థిరముగ నుండుట సులభము కాదు. మనసు యొక్క వేగము తట్టుకొనుటకు లేక నిర్జించుటకు ఆత్మబలముగాని, బుద్ధిబలము గాని ఆవశ్యకము. అట్టి లోకముల యందు వసించుటకు అభ్యాసము అవసరము. నిత్య జీవితమున ఆత్మానుసంధానము, అధ్యయనము, అవలోకనములయందు విరివిగ కృషి సలుపు వారికి క్రమముగ బుద్ధిలోకము లోనికి, ఆత్మలోకము లోనికి ప్రజ్ఞ వ్యాప్తి చెందును. ఆ లోకముల యందలి స్థిరత్వము ప్రజ్ఞకు పట్టు ఇచ్చును. క్రమముగ స్థిరత్వ మలవడును. అంతేగాక దిగువ లోకములలో అస్థిరత్వమున్నను, ఎగువ లోకములలో స్థిరత్వము ఉండునని కూడ అవగాహన యగును.

స్థితప్రజ్ఞత్వము ఆత్మ, బుద్ధి లోకములలో సాధ్యమని తెలిసి అధ్యయనము, ధ్యానము ద్వారా ఆ లోకముల స్థిరత్వమును పొంది మనో కక్ష్యలోనికి ప్రజ్ఞను ప్రవేశింప జేయువాడు చంచల మనస్కుడు కాడు. అనగా సులభముగ పొరపాటుపడుట, తొట్రుపాటు పడుట, కంగారు పడుట, పొరపాట్లు చేయుట, మరిచి పోవుట జరుగదు. కేవలము భగవద్గీత యందు చెప్పిన యోగాభ్యాసమును శ్రద్ధాభక్తులతో నిర్వర్తించుకొన్నప్పుడు మాత్రమే స్థిరమతి అగుటకు వీలుపడును.

కాలము, దేశము వలన ఏర్పడు ఆకస్మికమగు మార్పులకు

కూడ చెదరని స్థిరమతులున్నారు. నలుడు, హరిశ్చంద్రుడు, ధర్మరాజు మొదలగు వారందరు అట్టివారే. ఇట్టి స్థిరమగు భక్తి కలుగుటకు తనయందున్న ఈశ్వరునితో నిత్యమనుసంధానము ఏర్పరచుకొనుట ఒక్కటియే మార్గము. మరియొక మార్గము లేదు. తనలోని ఈశ్వరునితో, తాను అనుసంధానము చెందియున్నపుడు తన ప్రజ్ఞ స్థిరమై, దేశ కాలములకు చెదరక వర్తించును. ఇట్టి అనుసంధానమే నిజమగు భక్తి. అట్టివారు దైవమునకు కూడ ఉపకరణములై యుందురు. కనుక స్థిరమతులన్నచో నాకిష్టము అని శ్రీకృష్ణుడు పలికెను.

## 8

## ఏది ఉత్తమము ?

అర్జున ఉవాచ :

**ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే ।**
**యే చాప్యక్షర మవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః ॥ 1**

తాత్పర్యము : ఎల్లప్పుడు నీయందే మనసును నిలిపినవారై నిన్నుపాసించు భక్తులున్నారు. మరియు ఇంద్రియ గోచరము కాని నిన్ను అక్షర పరబ్రహ్మముగ ధ్యానించు వారున్నారు. ఈ ఇరు తెగలవారిలో నిన్ను బాగుగా ఎరిగిన వారెవరు?

వివరణము : పై పరిప్రశ్నము అర్జునుడు మానవజాతి కొరకై నిర్వర్తించినాడు. ఆది నుండి మానవజాతిలో పై రెండు తెగలవారు గలరు. పూజించుట, కీర్తించుట, భజించుట, భక్తి కార్యక్రమములు నిర్వర్తించుట ఇత్యాది వన్నియు అవ్యక్తమగు భగవంతుని ఆరాధించుట కేర్పడిన విధానములు. ధ్యానించుట కూడ అట్టిదే. సమస్త ఉపాసనలు కూడ దైవముతో కూడి ఉండుటకే. కార్య

క్రమము జరుగుచున్నంతసేపు దైవముతో కూడియుండు అవకాశ మున్నది. తదుపరి మానవప్రజ్ఞ వెనుకటి గుణములను ఆశ్రయించి యుండును. అందువలన దైవానుసంధాన ముండదు. ఎన్ని పూజలు చేసినను, దీక్షలు పట్టినను, తపస్సులు చేసినను, తదుపరి ప్రజ్ఞయొక్క స్థితి గమనించవలెను. మానవ ప్రజ్ఞ సాధారణ విషయముల యందు ఎట్లు ప్రవర్తించుచున్నదో గమనించు చుండవలెను. దైవకార్యములు నిర్వర్తించుచున్నపుడు ఒక రకము గను, స్వకార్యములు నిర్వర్తించుచున్నపుడు మరియొక రకము గను, లోక వ్యవహారములందు ఇంకొక రకముగను ప్రజ్ఞ వర్తించుటను గమనించవలెను. రకరకముల సన్నివేశములలో, రకరకములుగ ప్రతిస్పందించు ప్రజ్ఞకు అనన్య భక్తి కుదరదు. కేవలము భక్తి కార్యక్రమములకు మాత్రమే భక్తి నిలుచుట అనన్య భక్తి కానేరదు.

అట్లు కాక సమస్తమును దైవముగనే దర్శించుచు, వినుచు, అవసరము మేరకు సేవించుచు, మేల్కాంచినంతసేపు జీవించు వాడు అన్ని సమయములయందు ఒకే విధమగు దృష్టితో నుండి, దైవముతో కూడి యుండును. ఇట్టివాడు పూజా పునస్కారములు చేయనప్పటికిని చూచుట, వినుట, నిర్వర్తించుట యందు దైవమును దర్శించుచునే యున్నాడు. మేల్కాంచినంతసేపు దైవముతో కూడియే యుండును. ఇట్టి వారిని యోగులందురు. ఇది నిత్యఉపాసన. ఇట్టి యోగి పూజలు, అభిషేకములు చేయక

పోవచ్చును. సంధ్యాది కార్యక్రమములు నిర్వర్తించక పోవచ్చును. సదాచారములను పాటింపక పోవచ్చును. కాని సర్వకాల సర్వావస్థలయందు ప్రజ్ఞాపరముగ దైవముతోనే కూడియుండును.

పై తెలిపిన ధ్యానమార్గము, అటుపై తెలిపిన యోగ మార్గము లలో ఏది ఉత్తమమని అర్జునుని ప్రశ్న.

అనాదిగ ఈ ప్రశ్న మానవునకు తారసపడును. పరిణామ మును బట్టి మార్గమును ఎన్నుకొనును.

9

## ఉత్తమ యోగులు

*శ్రీభగవా నువాచ :*

**మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే ।**
**శ్రద్ధయా పరయోపేతా స్తే మే యుక్త తమా మతాః ॥ 2**

*తాత్పర్యము :* నాయందు మనసు నిలిపి, తదేక నిష్ఠులై, శ్రద్ధతో కూడినవారై, నన్ను ఉపాసించువారు ఉత్తమ యోగులని నా అభిప్రాయము.

*వివరణము :* మనసు భగవంతుని కర్పించి జీవించుట ఉత్తమ భక్తి అని దైవము తెలుపుతున్నాడు. మనసును దైవమున కర్పించిన వారికి తాముండక దైవమే యుండును. దైవమే తాముగా జీవించుచు నుండును. వారి పలుకులు, చేష్టలు దైవ పరమై యుండును. ఇట్టివారు ఉత్తమ యోగులు. వారికి లోక స్పృహ కూడ అంతంత మాత్రమే. నిత్య నైమిత్తిక కార్యములందు కూడ వారి ప్రయత్న మంతంత మాత్రమే. అంతయు దైవమే నిర్వర్తించుచు నుండును. ఇట్టి వారికి తామున్నామను స్పృహ

యుండదు. వీరు దైవమునకు పూర్ణమగు వాహికలై దైవ సంకల్పముగ తిరుగాడు చుందురు. వీరికెట్టి నియమములు, నిబంధనలు కూడ యుండవు. ఇట్టి ఉత్తమ యోగులు నేటికిని భారతదేశమున వింధ్య శ్రేణులయందు, సహ్యాద్రి పర్వత శ్రేణుల యందు, హిమాలయము లందు దర్శనమిచ్చు చుందురు. తమను గూర్చిన స్పృహలేక, శతాధిక వర్షములు దేహమునందు వసింతురు. వారు భూమిపై వసించుట లోక కళ్యాణము కొరకే. భగవత్ సంకల్పము మేరకే ఇట్టి ఉత్తమ యోగులు భూమిపై చరించుచున్నారు. వీరు ప్రథమ శ్రేణికి చెందిన భక్తులుగ శ్రీకృష్ణుడు పలుకుచున్నాడు.

## ⑩

## ఋషులు, మహర్షులు

యే త్వక్షర మనిర్దేశ్య మవ్యక్తం పర్యుపాసతే ।
సర్వత్రగ మచింత్యం చ కూటస్థ మచలం ధ్రువమ్ ॥ 3

సంనియమ్యేంద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః ।
తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః ॥ 4

*తాత్పర్యము :* కొందరు సమబుద్ధితో సమస్త ప్రాణులకును హితము చేయుటయందాసక్తి గలవారై అక్షరము, అనిర్దేశము, అవ్యక్తము, సర్వవ్యాపకము, అచలమగు తత్త్వముతో ముడిపడి జీవించుచుందురు. ఇట్టివారు నాకిష్టులు.

*వివరణము :* భగవత్ తత్త్వము గుణాతీతము, రూపాధికము అయి ఉండుటచే కొందరు భక్తులు తమ యోగనిష్ఠ ద్వారా, తమ వ్యక్తిగత చైతన్యమును వ్యాప్తి గావించుకొనుచు ఇంద్రియ లోకమును, మనోలోకమును, బుద్ధిమయ ఆనందమయ లోకములను దాటి జీవాత్మలుగ, పరమాత్మ అనుభూతిని పొంది, పరమాత్మ అనుసంధానముతో, పరమాత్మ సంకల్పము మేరకు లోకహిత కార్యముల నొనర్చుచు, ఎల్లప్పుడును సమబుద్ధితో నుందురు.

ఇట్టివారిని రెండవ శ్రేణి భక్తులుగ ఇచ్చట తెలియజేయు చున్నారు. వీరు భగవత్ కార్యము నిర్వర్తించుచున్నప్పటికి, తమను తామెరిగి, దైవమెరిగి, దైవ సంకల్పమెరిగి హిత కార్యములు చేయుచు నుందురు.

మొదటి శ్రేణి వారికిని, వీరికిని స్వల్పమగు వ్యత్యాసమున్నది. మొదటి శ్రేణి భక్తులు అవధూతలు. మనసర్పించిన వారగుటచేత, దైవమే సమస్తము వారినుండి నిర్వర్తించుకొనుచు నుండును. మొదటి శ్రేణివారికి తాముండక దైవమే ఉండుటచే అట్టి స్థితి కలిగెను. ఈ రెండవశ్రేణి వారికి తమ ఎరుక కూడ యుండును. దైవముతో కూడియుండుట కూడ యుండును. మొదటివారిది "బ్రహ్మోహమస్మి" అను స్థితి. రెండవ శ్రేణివారు కూడ "బ్రహ్మోహమస్మి" అను స్థితిని జ్ఞాన సమాధుల ద్వారా అనుభ వించుచు, ధారణయందు ఉంచి, దైవ సంకల్పమునకు వాహికలై యుందురు. దివ్యసంకల్పములనే నిర్వర్తించుచు నుందురు. వీరి బలము సమబుద్ధి, ఉపాసన, దైవముతో కూడియుండుట, హితకార్యము లొనర్చుట. ఇట్టి భక్తులు భగవత్ సంకల్పమును ఎరుకతో నిర్వర్తించుచు నుందురు. ఋషులు, మహర్షులు ఈ కోవకు చెందినవారు.

## (11)

## తత్త్వ స్పర్శ

**క్లేశోఽధికతర స్తేషా మవ్యక్తాసక్త చేతసామ్ ।**
**అవ్యక్తా హి గతి ర్దుఃఖం దేహవద్భి రవాప్యతే ॥ 5**

*తాత్పర్యము :* దేహాభిమానము గల జీవులకు అవ్యక్తమగు తత్త్వము నారాధించుట క్లేశము కలిగింప గలదు. నిరాకార తత్త్వమును ఆరాధించుట, అనుభూతి చెందుట కష్టమగు విషయము.

*వివరణ :* దేహమందున్న జీవునకు అనునిత్యము నామ రూపములతో సంబంధముండును. ప్రతిస్పందన ముండును. నామరూపములు లేని చైతన్యమును దర్శించుట సులభము కాదు. అభ్యాసవశమున నామరూపములనే చూచుట జరుగుచు నుండును. ఇట్లు భగవత్ తత్త్వము ఒక నామమునకును, ఒక రూపమునకును పరిమితి చేయుట వలన అదికూడ అభ్యాసమై నిలచి, ఇతర నామములను, ఇతర రూపములను దర్శించినపుడు సమభావ ముండదు. సమదృష్టి ఉండదు. సమదర్శనము జరుగదు.

భగవత్ తత్త్వము అన్ని కాలముల యందు, అన్ని దేశముల యందు, అన్ని రూపములయందు, అన్ని నామములయందు నిండియున్నదని, వాటి నతిక్రమించి కూడ యున్నదని తెలియుట తత్త్వజ్ఞానము. అట్టి జ్ఞానము పొందు ప్రయత్నమున దైవము రూపాతీతుడు, నామాతీతుడుగ దర్శించు ప్రయత్నము తప్పదు. రూపము నుండి మంత్రమునకు, మంత్రమునుండి తత్త్వమునకు పెద్దల సమక్షమున వృద్ధి చెందవలెను. మార్గము నందు సాధకుని చేతనలోని పరిమితులు క్రమముగ రాలిపోవలెను. ప్రాథమికముగ ఇబ్బందులు ఉన్నను ఇదియే రాజమార్గము. "అదృశ్యో వ్యక్తరూపశ్య" - అదృశ్యముగ నున్నదే, రూపముగ గూడ గోచరించు చున్నది అనెడి జ్ఞానము లభించు వరకు సాధన సాగవలెను. సిద్ధి పొందినపుడు "*అంతయు నీవె హరిపుండరీకాక్ష*" అని తెలియును. ముందు తెలుపబడిన ఒకటి, రెండు శ్రేణి భక్తులు ఇట్టి తత్త్వజ్ఞులు. వారి సాన్నిధ్యమున శ్రద్ధ, భక్తులు గల జిజ్ఞాసువులు సులభముగ తత్త్వ స్పర్శను పొందుదురు.

(12)

## సర్వ సమర్పణము

**యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః ।**
**అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే ॥ 6**

**తేషా మహం సముద్ధర్తా మృత్యుసంసార సాగరాత్ ।**
**భవామి న చిరాత్పార్థ మయ్యావేశిత చేతసామ్ ॥ 7**

*తాత్పర్యము :* ఓ అర్జునా! ఎవరైతే సర్వకర్మములు నాయందు సమర్పించి, నన్నే పరమగతిగా అనన్యచింతనతో ధ్యానించుచు, ఉపాసించుచు ఉందురో అట్టి వారిని ఈ సంసార చక్రము నుండి శీఘ్రముగ ఉద్ధరింతును.

*వివరణము :* ముందు శ్లోకమునందు అవధూతలు, లోకహితులు తెలుపబడిరి. వారు లోకమందలి కర్మబంధము దాటినవారు. వారి కార్యములు దివ్యములు. వారిని కర్మఫల మంటదు. వారు చేయు పనులయందు వ్యక్తిగత కామము గోచరించదు. అంతయు అపౌరుషేయమే. వారి ప్రజ్ఞ కారణాతీత లోకములలో స్థిరపడి యుండును. ఇట్టివా రరుదు.

కనుక మరియొక శ్రేణి భక్తుల గూర్చి దైవము తెలుపు చున్నాడు. సామాన్యముగ భక్తులకు కర్మబంధముండును. వారు కార్యకారణ సంబంధముతో జీవించుచు నుందురు. కర్మ ఫలములు బంధించుచు నుండును. ఫలములవలన కర్మలు, కర్మలను బట్టి ఫలములు, ఇట్లనంతముగ సాగుచునుండును. కర్మానుసారము పుట్టుట, చచ్చుట కూడ యుండును. ఇట్టి వారిలో కూడ తనకిష్ట మగు భక్తులగూర్చి దైవమిచ్చట తెలుపుచున్నాడు.

“మయ్యావేశిత చేతసామ్” అనునది కీలకం. ఏమి భావించి నను, మాట్లాడినను, చేసినను, తినినను, తిరిగినను సమస్తము తనకు సమర్పణ చేయుచు, కర్మలు నిర్వర్తించుచు జీవించువాడు కూడ త్వరితగతిని సంసార సాగరము నుండి, మృత్యువునుండి ఉద్ధరింపబడునని తెలుపుచున్నాడు.

భగవంతుని ఆశ్రయించిన ప్రజ్ఞ, భగవంతుని ఉపాసించుచు నుండును. భావించుచు నుండును. ధ్యానించుచు నుండును. తన నుండి నిర్వర్తింప బడుచున్న కర్మ కూడ భగవత్ సంకల్పమేనని భావించి, మంచి చెడులను నిర్ణయించక అంతటిని భగవత్ సంకల్పమే అని భావించుచు, తన స్వభావము ననుసరించి కర్మ లను నిర్వహించుచు, సర్వసమర్పణము చేయుచుండును. ఇది సర్వ సమర్పణమార్గము. తననుండి జరిపించుచున్న దంతయు దైవమే. తన కర్మము, కర్మఫలము కూడ దైవమునకే సమర్పణము.

తన తెలివి, తన వాక్కు, తన చేతన కూడ దైవమునకే సమర్పణ. తనకు సుఖ మిచ్చినను, దుఃఖ మిచ్చినను దైవమే. జయమిచ్చినను, అపజయ మిచ్చినను దైవమే. ధన మిచ్చినను, ఇవ్వక పోయినను దైవమే. తనయందు కలుగు భావములు కూడ దైవమే. ఇట్లంతయు దైవమే తన లోపల బయట యుండి, తన జీవితమును నడిపించుచున్నాడు. కనుక తాను దైవమునకు సమర్పణ చెంది, ఏ విషయమందు పట్టులేక, సన్యసించి జీవించుచునుండును. ఇట్టి వాని కర్మలు కూడ పరిష్కరింపబడి, పై తెలిపిన శ్రేణి భక్తులలో చేరుట జరుగును. దీనికొరకే దైవము భగవద్గీత యందు నిష్కామ కర్మయోగమును ముందుగ బోధించినాడు. భక్తుల జీవితములో ఇట్టి సర్వసమర్పణము ప్రకటించబడుచుండును. ఇట్టి భక్తుల కథలు కూడ శాశ్వతత్త్వము పొందును. అవధూతలు, లోకహితులు, సర్వ సమర్పణము చెందిన భక్తులు నాకిష్టులని ఇప్పటివరకు మూడు శ్రేణుల భక్తుల గూర్చి తెలిపినాడు.

## 13

## భాగవత మార్గము

**మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ ।**
**నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః ॥ 8**

*తాత్పర్యము :* నాయందే మనసు స్థిరముగ నిలుపుము. అట్టి మనసు క్రమముగ బుద్ధియందు ప్రవేశించును. బుద్ధియందు స్థిరముగ నిలచిన మనసు ఆనందలోకము చేరును. అటుపై నన్ను చేరి నాతో వసించును.

*వివరణము :* భగవంతుడు తనను చేరు మరియొక ఉపాయము తెలుపుచున్నాడు. ఇది నాలుగవ ఉపాయము. సమస్తము నందు లోపల, బయట నున్న దైవమును గుర్తించు చుండుట వలన, వినుచుండుట వలన మానవ ప్రజ్ఞ మనోలోకము నుండి బుద్ధిలోకము చేరును. మనోలోకములందు ద్వంద్వములు బంధించుచు నుండును. మమకారము గూడ హెచ్చుగ నుండును. మనసుయందు రొంపి ఎక్కువ, బురద ఎక్కువ. ఎంత కడిగినను మరల రొంపి అంటుచు నుండును. మమకారము వలన ఇష్టా యిష్టములు, రాగద్వేషములు ఆవరించి కర్తవ్యము విస్మరింప బడును. దైవమును చూచుట, వినుట, స్మరించుట వలన మనో

లోకములలో ఇరుకుకొని ఉన్న ప్రజ్ఞ బుద్ధిలోకమున ప్రవేశించును. బుద్ధియందు విచక్షణ చుక్కానియై దారి చూపించును. కర్తవ్యో న్ముఖుడగుట వలన ద్వంద్వముల నధిగమించి, మమకారము ప్రక్కన పెట్టి, చేయవలసిన పనియే చేయు చుండుట వలన ప్రజ్ఞకు లంపటములు తగ్గి, ఋషిప్రోక్తమగు జ్ఞానమునందు ఆసక్తి కలిగి, క్రమముగ పెరుగును. బుద్ధిలోకమున జ్ఞానాసక్తి, అధ్యయనము, నూతన కర్మాచరణము కలుగుచు, జీవిత మందలి మనోలోక చిల్లర విషయములందు ఆసక్తి రాలిపోవును. ఆహారము, విహారము, భోజనము, భజనము నిర్దిష్టమగు కార్యక్రమముగ రూపొందును. అధ్యయనము ఆచరణము ప్రధానమై నిలచి, ప్రజ్ఞ స్థిరపడగ, క్రమముగ ఆనందము లభించుచు నుండును. ఆనంద మయ లోకమున బుద్ధిలోకము ఇమిడిపోయి అవసరము మేరకు పనిచేయును. మనోలోకము, ఇంద్రియలోకము, భౌతిక లోకములు కూడ ఆనందమయ లోకము లోనికి ఇమిడిపోయి కాలమును, దేశమును, కర్తవ్యమును బట్టి తాబేలువలె వ్యక్తమగు చుండును. సాధకుడు ఆనందమయ లోకమున వసించుట అలవడును.

అట్టివాడు తనయందు తానుండి, ఈశ్వర అనుసంధానమున ఆనందము చెందుచు నుండును. ఆత్మానందమును, ఆత్మాను భూతిని పొందును.

పై విధముగ ఆరోహణ క్రమమున్నది. దానికి మూల సూత్ర మొకటియే. బాహ్యాంతరములందు దైవమునే దర్శించుచు, వినుచు, సేవించుచు నుండుట. ఇట్టి సాధకులు నాకు ప్రియులని దైవము పలుకుచున్నాడు. ఇది భాగవతమార్గము.

14

## నిరంతరత్వము

**అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్ ।**
**అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ ॥ 9**

*తాత్పర్యము :* చిత్తము నాయందు స్థిరముగ ధరింప జేయుటకు శక్తిలేనిచో (శక్యము కానిచో) నన్ను కోరుకొనుటను అభ్యాసము చేయుము.

*వివరణము :* దైవము నాలుగవ శ్రేణి భక్తులను ఇచ్చట తెలుపుచున్నాడు. మనస్సును బుద్ధియందు ప్రవేశింపజేసి, ఆ వెలుగు యందు నిలచియుండుట అందరికిని శక్యము కాదు. ఇతరములగు ఆలోచనలు మనసునందు ఏర్పడుచునే యుండును. అట్టి వారికి భగవదేచ్ఛ ఉపాయముగ ఈ శ్లోకమున తెలుపుచున్నాడు. భగవంతుని చూడవలెనని, వినవలెనని, భగవత్ స్పర్శ పొందవలెనని, తీవ్రమగు ఇచ్ఛ కారణముగ అభ్యాస మార్గమున భగవత్పరమగు భావము, భాష, కార్యక్రమములలో నిమగ్నమగుట వలన క్రమముగ, అభ్యాసమార్గమున భగవత్పర మగు చింతన, జీవనము పెరుగుచు, ఇతర విషయములందు

ఆసక్తి సన్నగిల్లిపోవును. భగవంతుని పొందవలెనను ఆసక్తి పెరుగుచు నుండును. క్రమముగ మనసు భగవత్పరమగు చుండును. దీనికి ప్రధానముగ వలసినది అభ్యాసము. అభ్యాసము అనగా నిరంతరత్వమును సిద్ధింపజేయునది. అన్నపానీయాదుల వలె, శ్వాసవలె, భగవంతుని గూర్చిన ఇచ్ఛ అంతరము లేక సాగి నపుడు, మనసు భగవత్పరమగును. అట్టివారు క్రమముగ దైవమను వెలుగులో వసించుట ప్రారంభమగును. అట్టి వెలుగు ఆధారముగ తన్ను తాను చేరుట, దైవమును తెలియుట సంభవించును.

పై తెలిపిన శ్రేణుల భక్తులలోనికి వీరు క్రమముగ పరిణామము చెందుదురు. ఇట్టి వారు తనకు ప్రియులని మరియొక శ్రేణి భక్తులను దైవము ప్రకటించినాడు.

15

## కర్మ నిర్వహణము

**అభ్యాసేఽప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ ।**
**మదర్థ మపి కర్మాణి కుర్వన్ సిద్ధి మవాప్స్యసి ॥ 10**

*తాత్పర్యము :* పై చెప్పిన విధముగ నా యందు ఇచ్ఛతో కర్మ నిర్వహణము చేయుట అభ్యాసము కాకున్నచో, చేసిన ప్రతి పనిని నాకు సమర్పించుటకు ప్రయత్నించుము.

*వివరణము :* భగవత్ సంకల్పమే తన సంకల్పముగ కార్యములు నిర్వర్తించు వారున్నారు. వారిది దివ్యజీవనము. వారికి వ్యక్తిగత సంకల్పము లుండవు. జీవితమంతయు దైవ సంకల్పముతోనే సాగిపోవుచుండును.

మరికొందరు దైవమును చేరుటకై దైవమునందిచ్ఛగొని దివ్యకార్యములు చేయుచు నుందురు. అట్టివారు దైవమే తన నుండి ఇట్టి కార్యములు చేయుచున్నాడని భావించుచు, జీవించినచో తరింతురు. గర్వపడినచో నశింతురు. గర్వపడక నిర్వర్తించు వారు దైవమహిమ దివ్య వైభవము దర్శించి, దివ్య కార్యములందు

వినమ్రులై తమను తాము సమర్పణము చేసుకొనుచు దివ్యత్వము లోనికి వృద్ధి చెందుచునుందురు. ముందుశ్రేణి భక్తులను చేరుదురు. క్రమముగ స్వంత సంకల్పములను కూడ దైవ సంకల్పములో మిళితము చేయుదురు.

ఇట్టి అభ్యాసము చాలమందికి వీలుపడదు. కారణము అహంకారమే, అజ్ఞానమే. అహంకారము వలన అజ్ఞానమా? అజ్ఞానము వలన అహంకారమా? దైవమే తానుగ నున్నాడని తెలియని వానికి పైరెండును ఒకేమారు జన్మించును. అందువలన సృష్టియందు అహంకారము సహజము. అజ్ఞానము సహజము. కాని పరిణామక్రమమున దేవుని తెలియవలెనని, పొందవలెనని ఇచ్ఛ కలుగుచుండును. అట్టి వానికి కూడ భగవానుడు మార్గము తెలుపుచున్నాడు.

మానవుడు కర్మిష్ఠి. మనసు యందుండుటచేత జ్ఞానేంద్రియ ములను, కర్మేంద్రియములను శరీరమును వాడక తప్పదు. దానితో కర్మలాచరించక తప్పదు. తానే చేయుచున్నాననను భావము తప్పదు. కనుక తననుండి జరిగిన పనులను, ఫలమును దైవమునకే సమర్పించమని బోధించుచున్నాడు. తెలిసో తెలియకో చేసిన పనులు మిశ్రమ ఫలముల నిచ్చుచుండును. కనుక "అన్నియు నీకే సమర్పణము. అన్నియు నీవే స్వీకరింపుము. నన్ను కృతకృత్యుని చేయుము" అని అనునిత్యము ప్రార్థించుట ఒక అభ్యాసము. ఇదియొక పవిత్రమగు అభ్యాసము. దీనివలన క్రమముగ దైవమే

సమస్తము నిర్వర్తించు చున్నాడని, తాను నిమిత్తమాత్రుడని తెలియును. ఇది తెలియుట వలన ముందు శ్లోకములలో తెలిపినట్లు, మనసును దైవమున కర్పించు గుణము జన్మించి వర్థిల్లును. ఇట్లు చేయుచున్నవారు నిష్కామబుద్ధితో కార్యములను నిర్వర్తించుచు నుందురు. ఇట్లారోహణ క్రమమున పరమ భక్తుల నుండి దైవమునందాసక్తి కలిగిన అహంకారుల వరకు దైవము మార్గము చూపించు చున్నాడు. నిష్కామముగ దివ్య కార్యములు నిర్వర్తించు వారికి వైరాగ్యము సహజముగ అబ్బును. అహంకార మమకారములు క్రమముగ తగ్గును. వ్యక్తిగత జీవనము క్రమముగ సడలి, సమష్టికై సమర్పణ చెందుట యుండును. తనను గూర్చిన భావన తగ్గి, సమష్టి భావన పెరుగును. తనను తాను ప్రేమించు కొనుట, పొగడుకొనుట, చెప్పుకొనుట సహజముగ తగ్గిపోవును. అందరియందలి దైవ కీర్తనమే మిగులును. **కర్మలు మానుట గాక, కర్మలు ప్రకృతి ప్రేరేపితములని, కర్మ ప్రేరితములని తెలిసి నిర్వర్తించి, వానిని అనునిత్యము దైవ సమర్పణము చేయవలెను.** నిత్యము నిదురపోవుట కుపక్రమించుటకు ముందు ఈ భావన చేయవలెను. ఇది అభ్యాసముగ జరుగవలెను. దీనివలన దైవమను వెలుగునకు మార్గములు తెరువబడును. *"మత్కర్మపరమోభవ"* అనియు *"మదర్థ మపి కర్మాణి కుర్వన్"* అనునవి ఈ శ్లోకమున ముఖ్య సూత్రములు.

16

## భగవదర్పితము

అథైతద ప్యశక్తోஉసి కర్తుం మద్యోగ మాశ్రితః ।
సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్ ॥ 11

*తాత్పర్యము :* కర్మలను నాయందు సన్యసించి నిర్వర్తించుటకు అసక్తుడ వగుచో, ఫలములైనను నాయందు సమర్పించు ప్రయత్నము చేయుము.

*వివరణము :* కర్మాచరణము ఎట్లును తప్పదు. ఫలములు మిశ్రమమై యుండును. కొన్ని కర్మలు కోరిన ఫలము లిచ్చును. మరికొన్ని కర్మలు కోరిన ఫలము లివ్వవు. ఇంకొన్ని కర్మలు కోరని ఫలము లిచ్చును. కొన్ని మిశ్రమ ఫలితము లిచ్చును. మానవునకు కర్మ నిర్వహణము నందే అధికారమున్నదిగాని, ఫలములయందు ఎప్పుడును అధికారము లేదు. ఫలముల యందధికారము లేనపుడు ఫలములాశించి పనిచేయుట అవివేకమే గదా! ఈ విషయము మూడవ అధ్యాయమున భగవంతుడు తెలిపినాడు.

అయినప్పటికిని అజ్ఞానముచేత, అహంకారముచేత ఫలము లాశించి, మానవుడు ఎడతెగక దుఃఖపడుచుండును. ముందు

శ్లోకమున కర్మాచరణమే భగవత్ సమర్పితముగ చేయమని తెలిపిన భగవానుడు, ఈ శ్లోకమున కర్మఫలములనైనను కనీసము సమర్పణ చేయమని ఉపదేశించుచున్నాడు. తన బుద్ధి మేరకు కర్మ నిర్వర్తించి ఫలములు భగవదర్పితము చేయుట కూడ భక్తియోగమున ఒక సోపానము. లేనిచో మానవుడు శుభాశుభ ఫలముల నాశించుచు, చింతాక్రాంతుడై జీవించవలసి యుండును.

1. కర్మఫలములు సన్యసించుట.
2. కర్మలు దైవమునందు సన్యసించుట.
3. మనోభావములను దైవమునందు సన్యసించుట.
4. సమస్తమును దైవ సంకల్పముగ నిర్వర్తించుట.
5. మనసును దైవమున కర్పించుట.
6. దైవ సంకల్పమునే లోకహితముగ నిర్వర్తించుట.
7. దైవమే తానుగ అవధూతయై వర్తించుట అను ఏడు సోపానములు ఇప్పటివరకు క్రమమున చెప్పబడినవి.

భక్తియోగ మనగా దైవమును పొందవలెనను ఇచ్ఛతో మానవుడు చేయు ప్రయత్నము. అందలి క్రమము ననుసరించి, శ్రద్ధా భక్తులతో ఈ యోగమును నిర్వర్తించుకొనినచో మార్గము సుగమమై యుండును. తెలిసి ఆచరించవలసిన అంశములే గాని, పారాయణ అంశములు భగవద్గీతలో లేవు.

## (17)

## కర్మఫలము

**శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానా ద్ధ్యానం విశిష్యతే ।**
**ధ్యానా త్కర్మఫలత్యాగ స్త్యాగా చ్ఛాంతి రనంతరమ్ ॥ 12**

*తాత్పర్యము :* కర్మఫల త్యాగము వలన శాంతి లభించును. వివిధమగు అభ్యాసముల కన్నను, జ్ఞానము కన్నను, ధ్యానము కన్నను కర్మఫలమును విడుచుటయే శాంతిని పొందుటకు మార్గము.

*వివరణము :* దైవ ప్రాప్తికై చేయు అభ్యాసములు చేయు వారికి చిత్తశాంతి జ్ఞానము వలన కాని, ధ్యానము వలన కాని త్వరితగతిని కలుగదని, కర్మఫలములను సమర్పణ చేసినవారికే శాంతి కలుగునని భగవానుడు ఒక ఉపాయము తెలుపుచున్నాడు. ఫలములయందాసక్తి గలవారు ఆశించిన ఫలములను పొంద లేనపుడు దుఃఖమునకు గురియగు చున్నారు. ఫలములు సన్య సింపనిదే చిత్తమునకు శాంతి లేదు. ఫలితములతో సంబంధము లేక కర్తవ్యము నాచరించుట మార్గమై యున్నది. కర్మఫలములను భగవంతునికి సమర్పణ చేయుచు, కర్తవ్యానుసారము జీవించు

వారికి ప్రథమముగ చిత్తశాంతి లభించును. అట్టివారు జ్ఞానోపాసనము, ధ్యానోపాసనము వంటి కార్యములను అంతరాయములు లేక నిర్వర్తించ గలరు. ముందు శ్లోకమునందే కర్మఫలములను దైవమునకు సమర్పించి జీవించుమని తెలిపిన భగవానుడు, ఈ శ్లోకమునందు కర్మఫల సన్యాసమును మరింత ప్రాముఖ్యముగ తెలిపినాడు.

దైవమును పొందు ఇచ్ఛ గలవారందరును ముందుగ శాంతమగు చిత్తమును పొందవలెను. శాంతమగు చిత్తము కలుగవలెనన్నచో కర్మఫలములను దైవమునకు సమర్పించుచు, కర్తవ్య కర్మలను చేయుచు నుండవలెను. అటుపైన క్రమముగ కర్మములు కూడ దైవమునకు సమర్పించుచు చేయుట అభ్యాస మగును. ఇట్టివారు నిర్వర్తించు కర్మము నిష్కామ కర్మయోగ మనబడును. భగవద్గీతయందు ప్రధానముగ ప్రకటించినది కర్తవ్యాచరణమే. ప్రాథమికమగు ఈ సూత్రమును అభ్యసింపక, అనేకానేక దైవీపరమగు విషయములను సేకరించిన మాత్రమున జ్ఞానులు కాలేరు. చిత్తశాంతి లేనివారు ప్రాణాయామాది కార్యములు కూడ చేయలేరు. కనుక ధ్యానము సుదూరమై యుండును. కేవలము ఆడంబరము కొరకు అధ్యయనము, ధ్యానము వంటి కార్యక్రమములలో మునిగి తేలుచున్నను, కర్మలు - కర్మ ఫలములు సమర్పించక పోవుట వలన ప్రాథమికమగు శాంతియే లభించదు. చిత్తమునకు

శాంతియే లభించనపుడు పొందిన జ్ఞానము నిలువదు. ధ్యానము సిద్ధించదు.

పై కారణముగ మరియొకమారు కూడ చిత్తశాంతి యొక్క ప్రాముఖ్యమును తెలియజేయుటకు ఈ శ్లోకము కర్మఫల సమర్పణమును మరల గుర్తుచేయు చున్నాడు. కనుక దైవము నందు ఆసక్తి గలవారు ఈ భక్తియోగమందుగల సోపానములు అవగాహన గావించుకొని, శ్రద్ధతో నిర్వర్తించుకొనవలెను. ఇందు తెలుపబడిన క్రమము అనుసరించవలెను.

1. కర్మఫలములను దైవమునకు సమర్పించుచు కర్మ లాచరించుట.
2. దైనందిన కర్మము కూడ భగవత్ సమర్పితము చేయుచు జీవించుట.
3. 13వ శ్లోకము నుండి 19వ శ్లోకము వరకు గల గుణములను క్రమముగ ఉపాసించుట.
4. భావములను భగవంతునికి సమర్పించి, అంతరాత్మ ప్రబోధము ననుసరించి నడచుట.
5. మనసును భగవదర్పితము చేయుట.
6. తనకు కలిగిన సంకల్పములను దైవమునకు

సమర్పించి, అంతఃప్రేరణతో వర్తించుచు, జరిగిన దంతయు దైవమే నిర్వర్తించు చున్నాడని భావించుట.

7. దైవ సంకల్పమునే తన సంకల్పముగ నెరిగి జీవించుట.

8. దైవమే తానుగ జీవించుట.

ఈ పై తెలిపిన సోపానక్రమము క్రమముగ అవలంబించు శ్రద్ధాళువు తప్పక తన స్వరూపము, సత్యము, ధర్మము ఎరిగి జీవించును.

## (18)

## అత్యంత ప్రియులు

**యే తు ధర్మ్యామృత మిదం యథోక్తం పర్యుపాసతే ।**
**శ్రద్దధానా మత్పరమా భక్తాస్తేఽ తీవ మే ప్రియాః ॥ 20**

తాత్పర్యము : పై వివరించబడిన అమృతమయమగు భక్తి ధర్మములను ఎవరైతే యథావిధిగ, భక్తి శ్రద్ధలతో ఉపాసన చేయుదురో వారు నాకు భక్తులలో అత్యంత ప్రియులు.

*శ్రీమద్భగవద్గీత యందలి 12వ అధ్యాయము*
*'భక్తియోగ' వివరణము*
*సంపూర్ణము.*

# ధనిష్ఠ ప్రచురణలు


## మాస్టర్ పార్వతీకుమార్‌గారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | అమనస్కుడు | 30-00 |
| 2. | అన్వేషకుడు | 100-00 |
| 3. | అసంగుడు | 25-00 |
| 4. | అంబరీషుడు | 80-00 |
| 5. | హెచ్.పి.బి. ఆత్మసాధనా సూత్రములు | 50-00 |
| 6. | భారతీయ సంప్రదాయము | 20-00 |
| 7. | గోవు-ప్రాముఖ్యత | 20-00 |
| 8. | హిమాలయ గురుపరంపర | 30-00 |
| 9. | దేవాపి మహర్షి బోధలు-1 | 60-00 |
| 10. | దేవాపి మహర్షి బోధలు-2 | 100-00 |
| 11. | మైత్రేయ మహర్షి బోధలు-1 | 60-00 |
| 12. | మైత్రేయ మహర్షి బోధలు-2 | 100-00 |
| 13. | మరువు మహర్షి బోధలు-1 | 60-00 |
| 14. | మరువు మహర్షి బోధలు-2 | 100-00 |
| 15. | ధనకాముని కథ | 25-00 |
| 16. | గాయత్రీ మంత్ర అవగాహన | 10-00 |
| 17. | జ్యోతిర్లింగ యాత్ర | 20-00 |
| 18. | కథాదీపిక | 40-00 |
| 19. | మన మాస్టరుగారు | 60-00 |
| 20. | మాస్టరు యోగము - సాధనా సూత్రములు | 80-00 |
| 21. | మాస్టర్ సి.వి.వి. (జన్మదిన సందేశము) | 30-00 |

ప్రతులకు : **ధనిష్ఠ పబ్లికేషన్స్,** 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్,
విశాఖపట్నం - 530 002. ఫోన్ : 0891-2701531, 2509154.
e-mail : www.dhanistha.org. info@dhanistha.org.

# ధనిష్ఠ ప్రచురణలు















ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
Phone : 0891-2701531 www.dhanishta.org info@dhanishta.org

"భక్తియోగ మనగా దైవమును పొందవలె నను ఇచ్ఛతో మానవుడు చేయు ప్రయత్నము. అందలి క్రమము ననుసరించి, శ్రద్ధా భక్తులతో ఈ యోగమును నిర్వర్తించుకొనినచో మార్గము సుగమమై యుండును. తెలిసి ఆచరించ వలసిన అంశములే గాని, పారాయణ అంశములు భగవద్గీతలో లేవు."

ధనిష్ఠ